# పేతురు వ్రాసిన రెండవ పత్రిక 3వ అధ్యాయము

## క్రీస్తు రాకడ దినము

ప్రియులారా, ఈ రెండవ పత్రిక మీకిప్పుడు వ్రాయుచున్నాను. 2 పరిశుద్ధ ప్రవక్తలు చేత పూర్వమందు
పలుకబడిన మాటలను, ప్రభువైన రక్షకుడు మీ అపొస్తలుల ద్వారా ఇచ్చిన ఆజ్ఞను మీరు జ్ఞాపకము
చేసికొనవలెనను విషయమును మీకు జ్ఞాపకము చేసి, నిర్మలమైన మీ మనస్సులను రేపుచున్నారు. 3
అంత్యదినములలో అపహాసకులు అపహసించుచు వచ్చి, తమ స్వకీయ దురాశల చొప్పున నడుచుకొనుచు, 4
ఆయన రాకడను గూర్చిన వాగ్దానమేమాయెను? పితరులు నిద్రించినది మొదలుకొని సమస్తమును సృష్టి
ఆరంభమునందున్నట్టే నిలిచి యున్నదే అని చెప్పుదురని మొదట మీరు తెలిసికొనవలెను. 5 ఏలయనగా
పూర్వము నుండిఆకాశముండెననియు, నీళ్లలోనుండియు నీళ్లమూలమునను సమకూర్చబడిన భూమియు దేవుని
వాక్యము వలన కలిగెననియు వారి బుద్ధిపూర్వకముగా మరతురు. 6 ఆ నీళ్ల వలన అప్పుడున్న లోకము నీటి
వరదలోమునిగి నశించెను. 7 అయితే ఇప్పుడున్న ఆకాశమును భూమియు భక్తిహీనుల తీర్పును నాశనమును
జరుగు దినము వరకు అగ్ని కొరకు నిలువ చేయబడినవై, అదే వాక్యము వలన భద్రము చేయబడియున్నవి. 8
ప్రియులారా, ఒక సంగతి మరచిపోకుడి ఏమనగా, ప్రభువు దృష్టికి ఒక దినము వెయ్యి సంవత్సరముల
వలెను, వెయ్యి సంవత్సరములు ఒక దినము వలెను ఉన్నవి. 9 కొందరు ఆలస్యమని ఎంచుకొనునట్లు ప్రభువు
తన వాగ్దానమును గూర్చి ఆలస్యము చేయువాడు కాడు గాని ఎవడును నశింప వలెనని యిచ్ఛయింపక,
అందరు మారుమనస్సు పొందవలెనని కోరుచు, మీ యెడల దీర్ఘశాంతము గలవాడైయున్నాడు. 10 అయితే
ప్రభువు దినము దొంగవచ్చినట్లు వచ్చును. ఆ దినమున ఆకాశములు మహాధ్వనితో గతించి పోవును,
పంచభూతములు మిక్కటమైన వేండ్రముతో లయమై పోవును, భూమియు దాని మీదనున్న కృత్యములును
కాలిపోవును.

## ఇందుకై సిద్ధపడవలసిన అవసరత

11 ఇవన్నియు ఇట్లు లయమై పోవునవి గనుక, 12 ఆకాశములు రవులుకొని లయమైపోవునట్టియు,
పంచభూతములు మహావేండ్రముతో కరిగిపోవునట్టియు దేవుని దినపు రాకడ కొరకు కనిపెట్టుచు, దానిని
ఆశతో అపేక్షించుచు, మీరు పరిశుద్ధమైన ప్రవర్తనతోను భక్తితోను ఎంతో జాగ్రత్తగలవారై యుండవలెను. 13
అయినను మనము ఆయన వాగ్దానమును బట్టి క్రొత్త ఆకాశముల కొరకును క్రొత్త భూమి కొరకును
కనిపెట్టుచున్నాము వాటి యందు నీతి నివసించును. 14 ప్రియులారా, వీటి కొరకు మీరు కనిపెట్టువారు
గనుక శాంతముగలవారై, ఆయన దృష్టికి నిష్కళంకులుగాను నిందారహితులుగాను కనబడునట్లు జాగ్రత్త
పడుడి 15 మరియు మన ప్రభువు యొక్క దీర్ఘశాంతము రక్షణార్థమైనదని ఎంచుకొనుడి ఆలాగు మన ప్రియ
సహోదరుడైన పౌలు కూడ తనకు అనుగ్రహింపబడిన జ్ఞానముచొప్పున మీకు వ్రాసియున్నాడు. 16 వీటిని
గూర్చి తన పత్రికలన్నిటిలోను బోధించుచున్నాడు అయితే వాటిలో కొన్ని సంగతులు గ్రహించుటకు
కష్టమైనవి. వీటిని విద్యావిహీనులును, అస్థిరులైన వారును, తక్కిన లేఖనములను అపార్థము చేసినట్లు, తమ
స్వకీయ నాశనమునకు అపార్థము చేయుదురు. 17 ప్రియులారా, మీరు ఈ సంగతులు ముందుగా
తెలిసికొనియున్నారు గనుక మీరు నీతి విరోధుల తప్పుబోధ వలన తొలగింపబడి మీకు కలిగిన

స్థిరమనస్సును విడిచి పడిపోకుండ కాచుకొనియుండుడి. 18 మన ప్రభువును రక్షకుడునైన యేసుక్రీస్తు
అనుగ్రహించు కృపయందును జ్ఞానమునందును అభివృద్ధి పొందుడి. ఆయనకు ఇప్పుడును యుగాంత దినము
వరకును మహిమ కలుగును గాక, ఆమేన్.